క్లుప్తంగా

ఆర్మూర్‌లో లోక్ అదాలత్



ఆర్మూర్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం మండల న్యాయసేవ అధికార చైర్‌పర్సన్, సీనియర్ సివిజల్ జడ్జి నసీమ్ సుల్తానా ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్ కేసు 1, ప్రిన్సిపాల్ జూనియర్ కోర్టుకు సంబంధించిన క్రిమినల్ కేసులు 12, ఆడిషనల్ కోర్టు సంబంధించిన 27 క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు 22, బ్యాంక్ రికవరి పీఎల్‌సీ 55 పరిష్కరమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కోర్టు పర్యవేక్షకుడు సూర్య ప్రభాకర్, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు కొండి పవన్‌కుమార్, జక్కుల శ్రీధర్; తలారీ పోచన్న పాల్గొన్నారు.

బడి నిర్మాణ పనుల పరిశీలన



మాక్లూర్: మండల కేంద్రంలో కొనసాగుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, సర్పంచ్ అశోక్‌రావు పరిశీలించారు. జూన్ నాటికి పాఠశాల ప్రారంభించుకునేలా పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు వారు సూచించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మీనారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రారంభం



రుద్రూర్ (కోటగిరి): మండల కేంద్రంలో లబ్ధిదారులు నిర్మించుకున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. జెడ్పీటీసీ శంకర్ పటేల్, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, విండో చైర్మన్ సిద్దు, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హమీద్, రైతు సమితి కన్వీనర్ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు



బోధన్: బోధన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 55వ రోజు కొనసాగుతున్నాయి. దీక్షలో అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, విద్యార్థి జేఏసీ ప్రతినిధి శివకుమార్, అమ్దాపూర్ యువకులు చరణ్, సోహెల్‌ఖాన్ ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



భీమ్‌గల్: మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు శనివారం భీమ్‌గల్ సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల 7వేలు విరాళంగా ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్‌ఐ రాజ్ భరత్ రెడ్డి మాట్లాడుతూ.. భీమ్‌గల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రుద్రూర్(కోటగిరి): కోటగిరి మండలకేంద్రంలోని సాక్షి రిపోర్టర్ హంగర్గా గంగాధర్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందాడు. దీంతో శనివారం బాధిత కుటుంబాన్ని ముదిరాజ్ రాష్ట్ర జర్నలిస్ట్ సంఘం నాయకులు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని నీలకంఠం ముదిరాజ్ భరోసా ఇచ్చారు. గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆర్మూర్‌లో కోతుల బెడద

- ఇళ్లలోకి వస్తున్న వానరాలు
- పట్టించుకోని అధికారులు



ఇళ్ల మధ్యలో సంచరిస్తున్న కోతులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్‌పరిధిలోని పలు ప్రాంతాల్లో కోతుల బెడద ఎక్కువైంది. గుంపులు గుంపులుగా తిరిగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తినుబండారాలు, ఇతర ఆహర పదార్థాల కోసం ఇళ్లలోకి వస్తున్నాయి. కోతుల భయానికి ప్రజలు తమ ఇళ్ల తలుపులు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళలు, చిన్నారులు బయటకు వెళ్లి సరుకులు బయటకు వెళ్లాలన్నా జంకుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని గోల్‌బంగ్లా, జెండాగల్లీ, హుస్నాబాద్, సైదాబాద్ కాలనీ, జిరాయత్‌నగర్, పాతబస్టాండ్, చిన్నబజార్, దయానంద్ నగర్‌లలో కోతుల బెడద తీవ్రంగా ఉంది.

బాటసారులపై దాడులు..

ఆర్మూర్‌లో ప్రతిరోజు ఏదోఒక వార్డులో కోతులు దాడిచేసిన సంఘటనలు ఉన్నాయి. చిన్నారులు అరుబయట ఆడుకుంటున్న సమయంలో కోతులు చిన్నారులపై దాడులు గాయాపరుస్తున్నాయి. ఉదయం వాకింగ్‌కు వేలుతున్న వారిపై సైతం కోతులు దాడులకు దిగుతున్నాయి. అలాగే ఇళ్లలోకి ప్రవేశించి సామన్లను చిందరవందరగా చేస్తున్నాయి. ఇంట్లో పండ్లు, కూరగాయలు ఎత్తుకెళ్తున్నాయి. కోతులు ఉదయం నుంచి రాత్రి వరకు ఇళ్లపై ఉండటంతో బయటకు వెళ్లే పరిస్థితి లేదు.

బయటకు వెళ్లాలంటే భయం..



కాలనీల్లో కోతులు గుంపులుగుంపులుగా వస్తున్నాయి. ఒంటరిగా ఉన్నవారిపై దాడిచేస్తున్నాయి. చేతిలో బ్యాగు కనిపిస్తే వెంటడుతున్నాయి. బయటకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తుంది. అధికారులు కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి.

–సుభాష్, ఆర్మూర్

చర్యలు తీసుకుంటాం..



పట్టణంలో కోతుల బెడద తీవ్రవంగా ఉంది. నివారణకు చర్యలు తీసుకుంటాం. త్వరలోనే కోతులను పట్టుకొని, అడవుల్లో వదిలేస్తాం. –మనోహర్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వానికి రైతులే గుణపాఠం చెబుతారు

వేల్పూర్: యాసంగి పంటలకు కరెంటు సరఫరా చేయకుండా మోసగిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వానికి రైతులే తగిన గుణపాఠం చెబుతారని బాల్కొండ నియోజకవర్గ బీజేపీ నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. కరెంటు కోతలకు నిరసనగా మండలంలోని అంక్సాపూర్‌లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు 14వేల మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటే కేవలం 4 వేల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి జరుగుతోందన్నారు. ఛత్తీస్‌ఘడ్ నుంచి వచ్చే విద్యుత్‌కు బకాయిలు సీఎం కేసీఆర్ చెల్లించలేదని, అందుకే విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, మల్కన్నగారి మోహన్‌రెడ్డి, ఏలేటి రమేశ్‌రెడ్డి, గాదెపల్లి రమేశ్, కొట్టాల మాల్లారెడ్డి, రవి కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



అంక్సాపూర్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనలో మాట్లాడుతున్న బిజేపీ నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి

ఉనికి కోసమే బీజేపీ ఆందోళనలు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేల్పూర్: బీజేపీ నాయకులు తమ రాజకీయ ఉనికి కోసమే ఆందోళనలు నిర్వహిస్తున్నారని మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో శనివారం జిల్లా రైతు బందు సభ్యుడు మహిపాల్, సర్పంచ్ ఎడ్లరాజేశ్వర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సుంకెట పెద్దమల్లారెడ్డి, చిన్న మల్లారెడ్డి, కిషన్, గంగయ్య విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడైనా గుంట వరి పంట ఎండిపోయి ఉంటే బీజేపీ నాయకులు చూపించాలని సవాలు విసిరారు.

వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కోత



ఆర్మూర్‌లో బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కోత విధించిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు అన్నారు. ఈమేరకు శనివారం పట్టణంలో రైతు సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్రచేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ. 2.25 లక్షల కోట్లు కేటాయించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు జాదవ్‌రాజు, కార్యదర్శి భామండ్ల రవి, రాము, బాలేరావు తదితరులు పాల్గొన్నారు

నవీపేటలో..

నవీపేట: మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి మొండిచేయి చూపారని ఆరోపించారు. బీజేపీ, పీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు దెవెందర్ సింగ్, మండల నాయకులు రామ్‌సింగ్, భిక్షపతి, కిషన్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

బోధన్: నియోజకవర్గం పరిధిలోని ఐదు గ్రామాల్లోని మైనార్టీ స్మశాన వాటికలు, దర్గాల అభివృద్ధి పనులకు మైనార్టీ వెల్ఫేర్ శాఖ ద్వారా నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే షకీల్ ఒక ప్రకటనలో తెలిపారు. నవీపేట మండలంలోని బినోలా దర్గా మరమ్మతులకు రూ. 17లక్షలు, నాడాపూర్ శ్మశాన వాటిక మరమ్మతులకు రూ. 3లక్షల 50వేలు, పోతంగల్ మైనార్టీ శ్మశాన వాటికకు, పెగడాపల్లి శ్మశాన వాటికకు, భవానీపేట్ దర్గా అభివృద్ధికి రూ. 5లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

గురుకులం తరలించడాన్ని మానుకోవాలి

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లోని జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాల తరలింపు మానుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్మూర్ నుంచి నిజాబామాద్ రూరల్ నియోజకవర్గంలోని మునిపల్లి గ్రామంలోకి తరలించేందుకు నిర్ణయించినట్లు తెలిసిందన్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్పందించి విద్యాసంస్థ తరలింపును కలెక్టర్‌తో మాట్లాడి ఆపాలన్నారు.

నిరుద్యోగులపై చిన్నచూపు సరికాదు



మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నవీపేట: రాష్ట్రంలోని నిరుద్యోగులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో శనివారం నిర్వహించిన 'ప్రజా గోస–బీజేపీ భరోసా' సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించలేని సీఎం, కనీసం నిరుద్యోగభృతి అయిన ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధిని విస్మరించిన సీఎం దేశాన్ని ఎలా ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. నాయకులు వడ్డెపల్లి శ్రీధర్, సర్పంచ్ ద్యాగ సరిన్, ఆనంద్, రామకృష్ణ, నాగేశ్వర్‌రావ్, సుదర్శన్, శ్రీకాంత్, కిషన్, భూషన్, రాజు, కాంతారావ్ పాల్గొన్నారు.

పండిత్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి





ఆర్మూర్‌లో దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు.. మోర్తాడ్‌లో..

ఆర్మూర్‌టౌన్: బీజేపీ సిద్ధాంత కర్త పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. శనివారం దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా ఆర్మూర్, మోర్తాడ్‌లో ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దీన్‌దయాళ్ ఏకాత్మతా మానవతావాదం' సిద్ధాంతాన్ని రూపొందించారని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త దీన్‌దయాళ్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో కాషాయ జెండా ఎగిరే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో రాణిస్తుందన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, నాయకులు జెస్సు అనిల్, వేణు, శ్రీనివాస్, పుప్పాల నరేష్, లక్ష్మి నర్సయ్య, శేఖర్, శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే నిర్మాణ వ్యయాల పెంపు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: కమీషన్ల కోసమే అభివృద్ధి పనుల నిర్మాణ వ్యయాలను పెంచుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఆరోపించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అండదండలతో నాయకులు, ప్రజాప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులకు భద్రత లేకుండా పోయిందని, మేయర్ భర్త, ఇతర బీఆర్‌ఎస్ నాయకులు అధికారుల విధులకు అడ్డుపడుతూ, ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గణేష్ గుప్తాకు కమీషన్లపై ఉన్న ధ్యాస పాలనపై లేకుండా పోయిందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే నొక్కేసిన ప్రతి పైసాను కక్కిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి యాదవ్, నారాయణ యాదవ్, యెండల సుధాకర్, నాగరాజు, శివప్రసాద్, రషీద్, శివప్రసాద్, నరేందర్, బాలకృష్ణ, కృష్ణ, రాహుల్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

బీఆర్‌ఎస్ బోధన్ అధ్యక్షుడిగా..



బోధన్‌రూరల్(బోధన్): బీఆర్‌ఎస్ (భారత రాష్ట్ర సమితి) బోధన్ మండల అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు సంజీవ్ కుమార్ (పెంటాకాలన్) నియామకం అయ్యారు. ఈమేరకు ఎమ్మెల్యే షకీల్ శనివారం ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ను పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని సంజీవ్ కుమార్ తెలిపారు.

ఆదర్శ నగర్ కాలనీ..

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి ఆదర్శ నగర్ కాలనీ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రకాశ్, ఆరుణ్, ఉపాధ్యక్షులుగా గడ్డం గోపి, గంగ నర్సయ్య, కోశాధికారిగా బాలరాజు, ఈవెంట్ ఆర్గనైజర్‌గా భూపేందర్, రాజు, శ్రావణ్, శ్యామ్, మహిపాల్ ఎన్నికయ్యారు. అడ్వైజర్ కమిటీ సభ్యులుగా గూపాల వినాయక్, రాము, అశోక్, మద్దికుంట నవజీవన్, దత్తు, రవి, రాజేశ్వర్ ఎన్నికయ్యారు.

సాలూర తహసీల్దార్‌గా మమత



బోధన్‌రూరల్(బోధన్): నూతనంగా ఏర్పాటైన సాలూర మండలం తహసీల్దార్‌గా మమత బాధ్యతలు స్వీకరించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే షకీల్, ఆర్డీవో రాజేశ్వర్ సమక్షంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, సాలూర సర్పంచ్ చంద్రకళ, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమాచారం..

ఆర్టీసీ అద్దె బస్సులపై రాయితీ

ఆర్మూర్‌టౌన్: శుభకార్యాలకు తీసుకువెళ్లే అద్దె బస్సులపై టీఎస్ ఆర్టీసీ 10శాతం రాయితీ కలిప్తుందని ఆర్మూర్ డిపో మేనేజర్ కవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రకాల బస్ సర్వీస్‌లపై 10 శాతం రాయితీ జూన్ 30వరకు అందిస్తున్నట్లు తెలిపారు. అద్దె బస్సులను అధికారిక వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన ప్రాజెక్ట్ కార్యాలయం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అధికారుల కోసం నిర్మించిన కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ప్రాజెక్ట్ కంటే ముందుగానే ప్రాజెక్ట్ కార్యాలయాన్ని 1960 ఫిబ్రవరి 7న అప్పటి ఏపీ పీడబ్ల్యూడీ శాఖమాత్యులు అల్లూరి సత్యనారాయణరాజు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్ట్ కార్యాలయానికి సరైన నిర్వహణ లేకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే చాలు నీరు కార్యాలయం లోపలికి వస్తోంది. కార్యాలయం గోడలపై మొక్కలు మొలకెత్తిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి ఒక్కో డివిజన్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తుండటంతో ప్రాజెక్ట్ కార్యాలయం కూడ కళ తప్పుతోంది. ఈక్రమంలో కార్యాలయ భవనానికి అధికారులు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

ప్రాజెక్ట్ కార్యాలయ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. శిథిలావస్థకు చేరడం వల్ల వర్షం పడినపుడు భవనం ఊరుస్తుంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడుతాం.

– అక్తర్, ఏఈఈ, ఎస్సారెస్పీ

సంక్షిప్తం

ఆర్థికసాయం అందజేత



రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలోని రమేష్ ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడగా.. శనివారం పీసీసీ డెలిగేట్ , రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ కన్వీనర్ యలమంచిలి శ్రీనివాస్ బాధితుడిని పరామర్శించారు.చికిత్స నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాయకులు వలియోద్దిన్, పీర్యా నాయక్, కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, సురేష్, హన్మంత్‌రావు ఉన్నారు.

ఆలయానికి విరాళం



రుద్రూర్: బాన్సువాడ మండలం పోచారం తండాలో నూత నంగా నిర్మించనున్న ఆలయంలో రామ్‌రావ్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు శనివారం చందూర్ జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఫ్లోర్‌లీడర్ అంబర్‌సింగ్ రూ.10వేల విరాళాన్ని అందచేశారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులకు పాదసేవ



నవీపేట: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శనివారం తల్లిదండ్రుల కృతజ్ఞత పూజోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి, పాదపూజ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఎస్సై రాజారెడ్డి, ఎంఈవో గణేష్‌రావ్, కరస్పాండెంట్ హన్మాండ్లు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మాడవేడి నవ్యశ్రీ అనే విద్యార్థిని చదువుకు ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌కుమార్ శనివారం భరోసా ఇచ్చారు. ఎమ్మెస్సీ న్యూట్రిషన్ కోర్సు చదువుతున్న ఆమెకు ల్యాప్‌టాప్ కొనిస్తానని హామీ ఇచ్చారు.